క్లుప్తంగా

పరామర్శ



టేకుమట్ల: భూపాలపల్లి మండలం జంగేడుకు చెందిన సీనియర్ ఆర్ఎంపీ ఏరుకొండ సాంబయ్య ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ గౌడ్ ఆస్పత్రిలో ఆయన్ని పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి చేపూరి రాజేందర్ ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

చిట్యాల: మండలంలోని చల్లగరిగలో ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై షా–ఖాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీలు చేస్తుండగా చల్లగరిగ గ్రామానికి చెందిన ఓదెల మొగిళి వద్ద 8 లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసుకుని విచారించగా మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా శ్రీనివాస్ నుంచి తీసుకొస్తున్నట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీన పర్చుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు సురేందర్, నవీన్, అస్లాం, జానీ ఉన్నారు.

సన్మానం



ఏటూరునగారం: మండల పరిధిలోని చిన్న బోయినపల్లి గ్రామంలో దూపాటి సతీష్ ఆశ్రయ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం మండల కేంద్రానికి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు షేక్ యూనస్ గ్రంథాలయంలో సతీష్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో యువతకు ఈ గ్రంథాలయం పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఎన్నిక



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎస్సీ మద్రిగూడెం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా తోకల శివ, మహజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడిగా యాసం మహేష్, అధికార ప్రతినిధిగా వేల్పుల మనోజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్ హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నుకోబడిన మండల కమిటీలు మాదిగల కోసం నిరంతరం పోరాటాలు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిల నరేంద్ర, గజ్జల ప్రశాంత్, శంకర్, అరవింద్ వేల్పుల మనోజ్ తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

శాయంపేట : పార్లమెంట్ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలు కావడంతో శాయంపేట పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బందితో తొలగించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, బస్టాండ్ ఎదుట, అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

ఇసుక బంగారమాయె!

- ట్రాక్టర్ ట్రిప్ రూ.7 వేల పైమాటే
- స్థానిక అవసరాలకు దొరకని వైనం
- గృహనిర్మాణ రంగం కుదేలు



అక్రమంగా తరలిస్తున్న ఇసుక(ఫైల్)

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో ఇసుక బంగారమైంది. ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం కుదేలవుతున్నది. దీనిపై ప్రత్యక్షంగా.. పరోక్షంగా.. ఆధారపడ్డ వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఎండాకాలం కావడంతో భవన నిర్మాణ రంగానికి చాలా అనువైన సమయం . ఈ సమయంలో ఇసుక కొరతను సృష్టించారు. ఫలితంగా తక్కువ ధరకు దొరకాల్సిన ఇసుక ఏకంగా ట్రాక్టర్ ట్రిప్ రూ.7 వేలు పలుకుతోంది. అది కూడా బ్లాక్‌లోనే. కొంత మంది దొంగచాటుగా ఇసుకను రాత్రికి రాత్రి తరలిస్తున్నారు. ఇసుక మాఫియాను అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నిర్మాణ రంగంపై ప్రభావం..

భవన నిర్మాణ రంగంపై ఇసుక కొరత తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎండాకాలంలో చాలా మంది కూలీలకు పనులు దొరకని పరిస్థితి. దీంతో వారంత భవన నిర్మాణ పనులకు ఎక్కువగా వెళ్తుంటారు. ఇసుక కొరతతో పనులు లేకుండా పోయాయి. వారి కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. అయితే ఇసుక కొరతను ఆసరాగా చేసుకున్న మాఫియా రెచ్చిపోతోంది. ట్రాక్టర్ ట్రిప్ రూ.5 వేలకు లభించాల్సింది రూ.7 వేలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

అనుమతులు లేకుండానే..

మండలంలోని కనిపర్తి శివారులో ఉన్న చలివాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి పూట ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారుల కళ్లు కప్పి ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు, ఆరు కాయలు అనే విధంగా కొనసాగుతోంది. అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.



ఇసుక లేక అసంపూర్తిగా భవన నిర్మాణం

నేటినుంచి 'పది' పరీక్షలు

కాటారం: మండలంలో నేడు (సోమవారం) నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల ద్వారా 590 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాటారం జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 200 మంది, మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ(బాలుర) పరీక్షా కేంద్రంలో 220 మంది, ఆదర్శ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో 170 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తప్పనిసరిగా హాల్‌టికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

టేకుమట్ల: మండలంలో నేటి(సోమవారం) నుంచి కొనసాగనున్న పది పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి ఆదివారం ఇక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకట్రావుపల్లి(బి), గర్మిళ్లపల్లి, వెలిశాల, కుందనపల్లి, టేకుమట్ల ఉన్నత పాఠశాలలతో పాటు, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం నుంచి 148 మంది పదవ తరగతి విదార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

కాళేశ్వరం: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన కర్ల వెంకన్న (72) అనే వృద్ధుడు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం దైవదర్శనానికి వచ్చాడు. వృద్ధుడికి మతిస్థిమితం లేక కాళేశ్వరంలో తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై భవానీసేన్‌ను ఆశ్రయించారు. ఆయన తన సిబ్బందితో కలసి 24 గంటల్లోనే తప్పిపోయిన వృద్ధుడి ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ రమేష్ తదితరులు ఎన్నారు.



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై

కృష్ణయ్యను కలిసిన నాయకులు

కాటారం: జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కాటారం సబ్ డివిజన్ బీసీ సంఘం ఇన్‌చార్జ్ ఆత్మకూరి స్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. సబ్ డివిజన్ పరిధిలోని బీసీల సమస్యలపై కృష్ణయ్యకు వివరించినట్లు స్వామియాదవ్ తెలిపారు. ఉద్యోగ, విద్య, రాజకీయపరంగా బీసీలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 56 శాతం బీసీ జనాభా ఉన్నందున బీసీ కులగణన చేపట్టి ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని విన్నవించారు. స్థానిక సంస్థల్లో సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, వార్డు సభ్యుల స్థానాల్లో బీసీ అభ్యర్థులు పోటీలో ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని కృష్ణయ్య సూచించినట్లు స్వామియాదవ్ తెలిపారు. బీసీ సంఘాలను సమన్వయం చేయడంలో భాగంగా త్వరలో కాటారానికి వస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. కృష్ణయ్యను కలిసిన వారిలో జాతీయ బీసీ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య, సీనియర్ నాయకులు యాదడ్ల రామన్న, గడ్డం చంద్రయ్య, కొంరయ్య, చిన్నమల్లు, బాపు, రాజయ్య, ఆత్మకూరి కుమార్, రాజ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణయ్యతో బీసీ సంఘాల నాయకులు

రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడిగా సతీష్



సతీష్, అధ్యక్షుడు



శివ, ప్రధాన కార్యదర్శి

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేటలో ఆదివారం రామప్ప జర్నలిస్టు సొసైటీని మండలానికి చెందిన జర్నలిస్టులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతి సతీష్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శివ, ఉపాధ్యక్షులుగా ఒద్దుల మురళి, కేతిరి భిక్షపతి, కోశాధికారిగా నూనె నరేష్, గౌరవ అధ్యక్షుడిగా రామిడి కృష్ణారెడ్డి, సలహాదారునిగా దేశిని మహేందర్, సభ్యులుగా గునిగంటి హరీష్, గోరంట్ల విజయ్‌కుమార్, మామిడిశెట్టి ధర్మతేజ, సారంగం, రఫీ ఎన్నికయ్యారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : ఎస్సైగా ప్రమోద్‌కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, మాజీ సర్పంచ్‌లు వల్పదాసి చంద్రమౌళి, బైరి శ్రీనివాస్, నాయకులు పల్లెబోయిన సారయ్య, పాడిశెట్టి గణేష్, అడప ప్రభాకర్, మారెపల్లి సదానందం, బుర్ర విజయ్, రాజమహ్మద్, నాగరాజు, విజయ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని వెలిశాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదును తీసుకువెళ్లరాదని, అంతకంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే ఆధారాలు తప్పకుండా చూపించాలన్నారు. లేని పక్షంలో నగదును సీజ్ చేస్తామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిస్వార్థంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి ఉంటుంది కావున ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా పోస్టులు చేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ప్రశాంత్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ములుగు రూరల్: రాష్ట్రంలో అత్యధిక జనాభ కలిగిన కురుమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకుడు కంచ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుమలు గొర్రెల కాపరులుగా, గొంగడి నేత కార్మికులుగా, బీరన్న ఒగ్గు కళాకారులు జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. కురుమలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో మేకల మహేందర్, శ్రీనివాస్, మల్లయ్య, రమేష్, సతీష్, నరేష్, జలేందర్ , దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల కులానికి..

వెంకటాపురం(ఎం): గాండ్ల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాండ్లకు కార్పొరేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గానుగల ద్వారా నూనె తీసి విక్రయించడం తమ కులవృత్తి అని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో యంత్రాల ద్వారా నూనే ఉత్పత్తి జరుగుతుండడంతో సుమారు 4 లక్షల మంది కులవృత్తికి దూరమై బీదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ములుగు రూరల్: మాట్లాడుతున్న ప్రభాకర్

'అరుణ్ కుమార్‌ను గెలిపించుకోవాలి'

వాజేడు: ఆదివాసీ బిడ్డ, విద్యావేత్త డాక్టర్ మైపతి అరుణ్ కుమార్‌కు ప్రతీ ఆదివాసీ ఓటు వేసి ఎంపీగా గెలిపించుకోవాలని కోరుతూ మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి యువకులు తీర్మానం చేశారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డికి మైపతి అరుణ్ కుమార్ రాగా గుమ్మడి దొడ్డి గ్రామ యూత్ అధ్యక్షుడు జెజ్జరి అశోక్ ఆధ్వర్యంలో యువకులు ఆయనను కలిసి మాట్లాడారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 4 లక్షలకు పైచిలుకు ఓట్లు ఆదివాసీలవే ఉన్నాయన్నారు. 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మైపతి అరుణ్ కుమార్ మూడవ స్థానంలో నిలిచారని గుర్తు చేశారు. ప్రతీ ఆదివాసీ తమ ఓటును అరుణ్ కుమార్‌కు వేసేలా తీర్మానాలను చేయాలని పిలుపు నిచ్చారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు లంబాడీలను బరిలో నిలిపిన క్రమంలో ఆదివాసీలందరూ ఒక్కతాటిపైకి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అరుణ్ కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సురేష్, గంగ రాజు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..

కన్నాయిగూడెం: మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా అన్నారు. ఈ మేరకు బీజేపీ నాయకుడు జాడి రామరాజు మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేశాడని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కరస్‌చందు గాంధీ, మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, సుమన్, కటకం మల్లయ్య, కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సునార్కని రాంబాబు, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, తాటిరాజ బాబు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

శాయంపేట : అప్పుల బాధ భరించలేక పురుగుల మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని కొత్తగట్టు సింగారంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం .. కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఎండీ.యాకుబ్(45) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. యాకూబ్‌కు ఒక కుమారుడు, కూతురు. కూతురు వివాహం చేసి ఇటీవల ఇల్లు నిర్మించుకోగా రూ. 5లక్షల అప్పు అయింది. అప్పు ఎలా తీర్చాలో తెలియక మద్యం సేవిస్తూ బాధపడేవాడు. భార్య కూలీ పని చేసి అప్పు తీర్చుదామని ధైర్యం చెప్పేది. మద్యం మత్తులో యాకూబ్ ఈ నెల 15న రాత్రి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి యాకూబ్ మృతి చెందాడు. మృతుని భార్య కైరూన్‌బి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.



యాకూబ్ (ఫైల్)

కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం

మల్హర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డిని రాష్ట్ర ట్రేడర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి లాకవత్ నవేందర్, కొయ్యూరు గ్రామ శాఖ అధ్యక్షుడు వేల్పుల మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లెకుంట గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం ప్రేమ్, మాజీ ఉపసర్పంచ్ మమత, సింగిల్‌విండో డైరెక్టర్ రమేష్‌రెడ్డి, నాయకులు జంగిడి శ్రీనివాస్, సమ్మయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డిని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు మంత్రి శ్రీధర్‌బాబుకు రెడ్డిగాండ్ల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు కోట రాజబాపు, మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, ప్యాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, రామ్‌మోహన్‌రావు, చిన్నన్న, వామన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, పోటు మల్లారెడ్డి, కోట సమ్మయ్య పాల్గొన్నారు.

కాటారం: భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డికి రాష్ట్ర ట్రేడింగ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంపై మండల కేంద్రంలో గాండ్ల సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రధాన కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీప పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, చిన్న సమ్మిరెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి,చీర్ల రమేశ్ రెడ్డి, వంశీవర్ధన్, రమేశ్‌రెడ్డి, కొట్టె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మల్హర్: మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



మహదేవపూర్‌లో..



కాటారంలో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేష్



గోవిందరావుపేట: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వాజేడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు ఎస్సై రమేష్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులో ప్రేమ పేరుతో బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచిగా చదువుకొని ఉద్యోగాలను సాధించాలన్నారు. గంజాయి, గుడుంబా, బెల్లం, పటిక లాంటివి సరఫరా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని తెలిపి ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. ప్రభుత్వ నిషేధిత విప్లవ సంఘాలకు, విప్లవ పార్టీలకు సహకరించవద్దని వాటికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గోవిందరావుపేట: మండలంలోని ముత్తాపూర్, టప్పమంచా గ్రామాల్లో పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ ఆదివారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పస్రా సీఐ శంకర్ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికి కూడా ఓటీపీ కానీ, బ్యాంక్ సంబంధిత వివరాలు కానీ చెప్పకూడదు అని అన్నారు. పస్రా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే 1930 నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేకుంటే పోలీస్ స్టేషన్ కు వచ్చి తమను సంప్రదించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



ఎస్ఎస్‌తాడ్వాయి: అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని మేడారం గ్రామానికి చెందిన మాదరి కృష్ణవేణికి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పురిటి నొప్పులు రావడంతో స్థానిక ఆశ వర్కర్ రజిత సాయంతో జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో ములుగు కేంద్రానికి సమీపంలో నొప్పులు అధికం కావాడాన్ని గమనించిన టెక్నిషియన్ శివలింగంప్రసాద్ గర్భిణికి రాత్రి 2 గంటల సమయంలో సుఖ ప్రసవం చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి, బిడ్డలకు ప్రథమ చికిత్స చేసి ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మహిళకు మొదటి కాన్పును సుఖ ప్రసవం చేసిన 108 అంబులెన్స్ టెక్నిషియన్ శివలింగంప్రసాద్‌ని, పైలట్ ఓదెలును కుటుంబ సభ్యులు అభినందించారు.